క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ మంగళవారం కలిశారు. స్థానిక దుర్గానగర్‌లోని నివాసం వద్ద ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఉద్యోగుల సంక్షేమం, బొగ్గు ఉత్పత్తి తదితర విషయాపై చర్చించారు. జీఎం వెంట ఓసీపీ–3 సర్వే అధికారి చంద్రమౌళి ఉన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నస్రీన్‌బేగం

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలో ఇందిరమ్మకాలనీ, భీమయ్యకాలనీ తదితర కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ నస్రీన్ బేగం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని మాజీ కార్పొరేటర్ పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక తహసీల్దార్ రజిత, ఎంపీడీవో జయశీల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కాగా అధికారులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లారెడ్డి, ఆర్‌ఐ వినోద్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన



రైల్వేస్టేషన్‌లో విద్యార్థులు

రామగుండం: విద్యుత్ పొదుపు వారోత్సవాలు 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన లిటిల్ సిటిజన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల బృందాన్ని రైల్వేస్టేషన్‌లో వివిధ విభాగాలలో విద్యుత్ పొదుపు విధానాలను చూపిస్తూ వారికి అవగాహన కల్పించారు. దీంతో పాటు ఇళ్లలో విద్యుత్ ఉపకరణాల వినియోగంతో పొదుపు చర్యలను వివరించారు. ద.మ.రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎండీ.ఇర్ఫాన్, డి.వీరన్న, ఈ.చంద్రం, కె.కుమారస్వామి ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెగా హెల్త్ క్యాంపు



గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రోహిణి హాస్పిటల్ నిర్వాహకులు విద్యార్థినుల్లో వచ్చే రక్తహీనత, దంత సమస్యలపై మంగళవారం మెగా హెల్త్ క్యాంపు శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థునులకు రక్త పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గార మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జీడి కనకయ్య, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ చేరాలు, అధ్యాపకులు రహెమాన్, శంకర్, శ్రీనివాస్, అలీ, రాజిరెడ్డి, శంకరయ్య, ప్రియదర్శిని, జగదీశ్వరి, శ్రీగోదా పాల్గొన్నారు.

మొక్కజొన్న దగ్ధం

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన ఆశంశెట్టి వెంకటేశ్ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట మంగళవారం దగ్ధమైంది. రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టడంతో పంట చివరిభాగాన అగ్నికి దహనమైంది. ఆరుగాలం సాగుచేసిన మొక్కజొన్న పంట అగ్నికి దగ్ధం కావటంతో రైతు దంపతులు లబోదిబోమంటున్నారు. పంటనష్ట పరిస్థితిని గ్రామపెద్దలకు రైతు చూపించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.

ఒకే గది.. రెండు తరగతులు

- టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- నిధులున్నా.. అభివృద్ధి శూన్యం
- పీఎంశ్రీ, మన ఊరు–మనబడి, ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎంపికైనా.. సౌకర్యాలు కరువు
- గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి



ఒకే తరగతి గదిలో రెండు క్లాసుల విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: ఆ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పీఎం శ్రీ, మన ఊరు–మనబడి, ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎంపికైంది. అయినప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు పలు పథకాల కింద నిధులు కేటాయించినా పనులు ప్రారంభించని దుస్థితి నెలకొంది. సరైన తరగతి గదులు లేకపోవడం, ఉన్నవి సిమెంట్ రేకుల షెడ్డులోనే గదులు కొనసాగుతున్నాయి. అంతేగాక ఒక్కో తరగతి గదిలోనే రెండు క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 95 మంది విద్యార్థులు ఉన్నారు.

పలు పథకాలకు ఎంపికైన పాఠశాల..

కేంద్రం (పీఎం శ్రీ) జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టగా మొదటి దఫాలోనే జిల్లాలనే ఈ పాఠశాల ఎంపికైంది. అంతేగాక మన ఊరు–మన బడి కింద ఎంపిక కాగా మరమ్మతు పనుల కోసం దాదాపు రూ.14లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ కింద కిచెన్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం దాదాపు రూ.13 నుంచి 14లక్షల నిధులు కేటాయించారు. కాగా టాయిలెట్స్ పనులు ప్రారంభించినా అసంపూర్తిగానే ఉన్నాయి. కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు చేపడితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి



పాఠశాలను అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పిస్తే ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. మన ఊరు–మన బడి, ఎన్ఆర్ఈజీఎస్, పీఎం శ్రీ పథకాలకు పాఠశాల ఎంపికైనా సంతోషం లేదు.

– సుధాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు



శిథిలావస్థలో ఉన్న తరగతి గది



రేకుల షెడ్డులోనే తరగతి గదులు

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: ప్రజల నుంచి ఒక్క రూపాయి లంచం తీసుకున్నా.. సహించేది లేదని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని మిలీనియం హాలులో అంతర్గాం మండల స్థాయి ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా కల్యాణలక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు నీళ్లు పోతున్నాయని, ఈ ప్రాంత రైతులకు కంటనీరు రాకుండా రైతులకు అండగా ఉండి పని చేయాలని ఆదేశించారు. బండల వాగులో నీరు నింపి రైతులకు నీళ్లు ఇచ్చే విషయంపై అధికారులతో చర్చించారు. ఇసుక, బూడిద దోపిడీ జరగకుండ చూడాలని ఆదేశించారు. ఎస్సారెస్పీ కెనాల్‌కు మరమ్మతు చేసి పంట పొలాలకు నీరు అందించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దుర్గం విజయ, తహసీల్దార్, ఎంపీడీవో సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఎమ్మెల్యేగా గెలిచాక మొదటిసారిగా యైటింక్లయిన్‌కాలనీ వచ్చిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆయన సతీమణి మనాలి రాజ్‌ఠాకూర్‌కు మంగళవారం ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహిళలకు భవన నిర్మిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలు అమలు అవుతున్నాయని, మిగతా గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. అనంతరం అల్లూరు హనుమాన్ ఆలయంలో అన్నదాన చేశారు.

అంజన్న సన్నిధిలో పెద్దపల్లి ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న అర్చకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, పావని దంపతులు మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు.

ఎమ్మెల్యేకు సత్కారం

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును మంగళవారం జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వెంకటేశం, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు ఉన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఓదెల: మండలంలోని కొమిర గ్రామంలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల షటిల్ టోర్నమెంట్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మంగళవారం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, ఉపసర్పంచులు గోలి లింగారెడ్డి, వంగల శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీవైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, మాజీ సర్పంచు జక్కుల వెంకటస్వామి, నాయకులు రెడ్డి రజనీకాంత్‌గౌడ్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ సీఎండీని కలిసిన జీఎం



రామగిరి: ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వరుణ్‌రెడ్డిని మంగళవారం ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా వచ్చిన సీఅండ్ ఎండీని కలిసి అక్కెపల్లి పునరావస కేంద్రంలో విద్యుద్దీకరణ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకులంగా స్పందించిన సీఅండ్ ఎండీ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీఎం వెంట డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, పెద్దపల్లి ఎస్ఈ సుదర్శన్ ఉన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

జూలపల్లి: గ్రామీణ పేదల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సర్పంచ్ నర్సింహయాదవ్ సూచించారు. వికసిత భారత్‌లో భాగంగా మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలను చైతన్యం చేసేందుకు మోడీ ప్రభుత్వ హామీ చైతన్య రథం ద్వారా అవగాహన కల్పించారు. ఎంపీడీవో జీవన్‌బాబు, కార్యదర్శి లచ్చయ్య, సీహెచ్‌వో కలీం, ఉపసర్పంచ్ మహేశ్, హెచ్‌వీ వసంత, ఏఎన్ఎం విజయ ఉన్నారు.

ధూళికట్టలో..

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం ఎల్ఈడీ స్క్రీన్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. ప్రధానంగా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీమోర్చా అధికార ప్రతినిధి జాడి బాలరెడ్డి, నోడల్ అధికారి అమరేందర్‌నాయక్, సర్పంచ్ గొల్లె కావేరి, డాక్టర్ శ్రావణి, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, ఏఎన్ఎం లత, ఆశ కార్యకర్తలు స్వప్న, సంధ్య, కళావతి, సునీత, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మన్ పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి

పెద్దపల్లిరూరల్: పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే కమాన్, మసీద్ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులను గమనించి అప్పటి కలెక్టర్ టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నా.. ఇప్పటివరకు ఏర్పాటుకు నోచుకోలేదన్నారు. వీలైనంత తొందరగా వీటిని నిర్మించి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని కోరారు.

ఓటు నమోదుపై శిక్షణ

ముత్తారం: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి మాట్లాడుతూ ఓటు నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఏమైనా సవరణలు ఉంటే చేయాలని ఆదేశించారు. ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకునేలా స్థానికుల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఉదయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ భవాని, ఆర్‌ఐ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల వివరాలు సేకరణ

జ్యోతినగర్: బడి బయటి పిల్లల వివరాలు సేకరణ ప్రారంభమైంది. మంగళవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని మల్యాపూర్, నర్రాశాలపల్లెలో సీఆర్‌పీ రాంకుమార్, ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ వివరాలు సేకరించరారు. 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు వరుసగా 30రోజులు స్కూల్‌కు వెళ్లకుండా, అసలే స్కూల్‌కు వెళ్లకుండా ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. జనవరి10 వరకు వివరాల సేకరిస్తామని పేర్కొన్నారు.

రెస్క్యూ పోటీ విజేతలకు అభినందన



అభినందిస్తున్న జీఎంలు

రామగిరి: ఆర్జీ–2 ఏరియాలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించిన 52వ జాతీయస్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల్లో విజేతలుగా నిలిచిన సింగరేణి బీ టీంలో పాల్గొన్న ఆర్జీ–3, ఏపీఏ బృందం సభ్యులను మంగళవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అభినందించారు. సింగరేణి సంస్థలో రెస్క్యూ సిబ్బందికి మంచి గుర్తింపు ఉందని, భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజనీర్ టి.రఘురాం, ఫారెస్ట్ డీజీఎం బి.కర్ణ, ఎస్ఓఎం కె.జనార్దన్, రెస్క్యూ బృందం సభ్యులు భాస్కర్‌రెడ్డి, నవాబ్, మురళి, అనిల్‌కుమార్, శ్రీకాంత్, రాకేశ్, పవన్, శ్యాం ఉన్నారు.

టీబీజీకేఎస్‌తోనే కార్మికుల హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: టీబీజీకేఎస్‌తోనే కార్మికుల హక్కుల పరిరక్షణ సాధ్యమని ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం వకీల్‌పల్లి గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. హక్కుల సాధించిన సంఘంగా గనులపైకి వచ్చి ఓట్లు అడిగే హక్కు తమ యూనియన్‌కు ఉందన్నారు. జాతీయ సంఘాలు వేజ్‌బోర్డ్ సభ్యులుగా ఉన్నప్పటికీ కార్మికులకు ఎలాంటి న్యాయం చేయలేకపోయారని ఆరోపించారు. కేవలం ఓట్లు కోసం ఇక్కడికి వచ్చి ఒక ప్రాంతీయ సంఘాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. తాము చేసిన పనులను గుర్తించి యూనియన్ ఎన్నికల్లో టీబీజీకేఎస్ బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మల్లికార్జున్, సంపత్‌రెడ్డి, సంతోష్, శంకర్, బట్టు మురళి, వెంకటేశ్, నల్లు, చందు, అశోక్, అనిల్‌రెడ్డి, మామిడి తిరుపతి, నర్సయ్య, బేతి చంద్రయ్య పాల్గొన్నారు.

సర్కార్ సంఘాల మద్దతుతోనే ఎన్నికలు ఆలస్యం



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: సర్కార్ సంఘాల మద్దతుతోనే ఎన్నికలు జాప్యం చేస్తున్నారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం సింగరేణి ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గని, 2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణి ఎన్నికల కోసం ఏఐటీయూసీ పోరాడుతోందన్నారు. యాజమాన్యం గత గుర్తింపు సంఘంతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా వాయిదాలు వేస్తుంటే తాము కార్మికుల పక్షం వహించి ప్రజాస్వామ్యం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం కేంద్ర కార్మికశాఖ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపేందుకు పూనుకుందన్నారు. ప్రశ్నించే గొంతుకగా, పోరాడే సంఘంగా ఏఐటీయూసీని గుర్తించి భారీ సంఖ్యలో కార్మికులు యూనియన్‌లో చేరుతున్న యువతరానికి స్వాగతం పలుకుతున్నామన్నారు. ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీనివాస్, బోగ సతీశ్‌బాబు, ఎం.సంపత్, కన్నం లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట్‌రెడ్డి, గొడిశాల నరేశ్, సిద్దమల్ల రాజు, చెప్యాల భాస్కర్ పాల్గొన్నారు. 50 మంది ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే సీనియర్ కార్మికులతో సేఫ్టీ కమిటీలు నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం ఓసీపీ–5లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల రక్షణ పరికరాలు అందించడంలో యజమాన్యం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు, పూర్తిగా విఫలం అయ్యాయని ఆరోపించారు. రక్షణ కమిటీల్లో సీనియర్ ఎఫిషియన్సీ కార్మికులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మార్పు రావాలి సీఐటీయూ గెలవాలనే నినాదంతో డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సూర్యుని గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, గౌస్, బి.రఘువరన్, రాజమౌళి, బిక్షపతి, శివరాంరెడ్డి, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల విషయంలో తగ్గేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల రక్షణ, హక్కుల విషయంలో తగ్గేది లేదని ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను తాము వాయిదా వేయడానికి కోర్టుకు వెళ్లామని, తప్పుడు ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీకి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తరన్నారు. 27న జరిగే ఎన్నికలకు ఐఎన్టీయూసీ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మార్క రాజు, దేవనపల్లి చక్రపాణి, వీరారెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధన ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం

రామగిరి: సింగరేణి కార్మికుల హక్కుల సాధన ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని, కార్మికులు ఐఎన్‌టీయూసీకి మద్దతు పలకాలని జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గనికి చెందిన సుమారు 50 మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, ధర్మపురి, ఏపీఏ ఫీట్ సెక్రటరీ మందల కొమురయ్య, బ్రాంచ్ కార్యదర్శి సాయికృష్ణ, మత్రి ఓదెలు, బత్తుల రమేశ్ పాల్గొన్నారు.

కార్మికులు ఏఐటీయూసీకి మద్దతు తెలపాలి



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

రామగిరి: సింగరేణి కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమని, కార్మికులందరూ ఏఐటీయూసీకి మద్దతు పలకాలని అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య కోరారు. మంగళవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 వద్ద ఫీట్ సెక్రటరీ మత్రి రాజు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేయగా రంగయ్య మాట్లాడారు. సింగరేణి కార్మికులు హక్కులు సాధిచాలన్నా, సింగరేణి సంస్థ భవిష్యత్ కోసం కార్మికులు ఏఐటీయూసీని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ట్రేడ్‌మెన్ సెక్రటరీ ఎన్‌వీ రాజు, బి.పోశం, శ్రీనివాస్, సదానందం, వెంకటేశ్వర్లు, పి.కనకయ్య పాల్గొన్నారు.

బీఎంఎస్‌ను గెలిపిస్తే ఉద్యోగ అవకాశాలు

గోదావరిఖని: రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య, వైద్యం, సంక్షేమం అమలుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల సంక్షేమం, పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, వెంకటస్వామి, కోటయ్య, రాజేశం, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, సాంబయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు క్యాడర్ స్కీం మార్పిడి, మహిళా కార్మికులకు విద్యార్హతను బట్టి ఉద్యోగం, ఈఅండ్ ఎం అన్‌ఫిట్ అయిన మైనింగ్, టెక్నికల్ ఆపరేటర్లను సర్ఫేస్‌కు బదిలీ చేయడం కార్మికుల గెలుపు అన్నారు. తరాజు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. యూనియన్ అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఆర్‌జీ–3 బ్రాంచ్ నాయకులు ఇస్మాయిల్, కొమ్ము మధునయ్య, మహమూద్‌ఖాన్, అశోక్, సత్యనారాయణ, మల్లారెడ్డి, వీరయ్య, రామకృష్ణ, సదానందం, షకీల్, స్వామి పాల్గొన్నారు.